# ఎందుకు?

నెలరోజుల తర్వాత ఆఫీసులో కూర్చుని పనిచెయ్యాలంటే యిబ్బందిగానే వుంటుంది. నా ముందున్న ఫైళ్ళను చూస్తోంటే భయం పుట్టుకొస్తుంది. పాపం పెరిగినట్టు పెరిగాయి ఫైళ్ళు. అక్కడికీ ఎవరో పుణ్యాత్ములు చెయ్యిచేసుకోబట్టి కొంతైనా తరిగింది. అలాకూడా జరక్కపోతే యింకెంత దిగులుపడేవాడినో ఏమో!

ఈ నెలరోజుల్లోనూ ఆఫీసులో చాలా మార్పులు జరిగాయి. మిత్రుడు రంగనాథానికి బదిలీ అయింది. కొత్త ఆఫీసరూ, కొత్త హెడ్ గుమాస్తా డ్యూటీలో చేరారు. లోగడ మా ఆఫీసు రైల్వేస్టేషను దగ్గర్లో వుండేది. ఇప్పుడేమో ఊరికి చివరన్నట్టు రెండు మైళ్ళు ఇవతలికి మార్పు చేశారు.

సంవత్సరంపాటు ఈ ఆఫీసుతో పరిచయమున్న నాకు—ఈనాడు యిదే ఆఫీసు కొత్తగా కనిపిస్తోంది. పైగా - నెల రోజులు కులాసాగా గడిపిన తర్వాత, ఆఫీసుకి వచ్చి నడుంవంచి పనిచెయ్యా లనిపించలేదు. మరో నాలుగు రోజులు సెలవడిగి మా ఊరు వెళ్ళిపోదామనిపిస్తోంది. ఏ

---

7-12-62 ఆంధ్ర సచిత్ర వారపత్రిక

కారణమూ లేనిదే నాలుగు రోజులు సెలవెలా యిస్తారూ నా పిచ్చి కాపోతే ?

జీవితంలో 'పెళ్ళి' ఒక ముఖ్యమైన ఘట్టం కాబట్టి. మా రంగ నాధ మన్నట్టు 'కాంట్ బట్' కాబట్టి నెల రోజుల సెలవు (అదీ అతి కష్టంమీద) మంజూరయింది. అలాంటిది సరైన కారణమంటూ లేకుండా నాలుగు రోజుల సెలవు కావాలంటే ఎవరిస్తారు ?

పదిన్నరయ్యేసరికి ఆఫీసు బృందమంతా తమ తమ స్థానాలలోకి వచ్చారు. ఎవరో ఇద్దరు కొత్త గుమాస్తాలకి నన్ను పరిచయం చేశాడు మధుసూదనం. వాళ్ళిద్దరికీ నన్నొక కథకుడిగా పరిచయం చేయడంతో— ఈ పరిచయానికి వాళ్ళు ప్రత్యేకమైన విలువ యివ్వడం జరిగింది. కథలు రాసేవాళ్ళమీద వాళ్ళ కెంత గౌరవభావముందో వాళ్ళ మాటల ద్వారా వ్యక్తపడింది. ఆ కాసేపూ ఆనందించక తప్పిందికాదు.

ఆ తర్వాత పాత మిత్రులు ఒక్కరొక్కరే నా స్థానందగ్గరకు వచ్చి నా యోగక్షేమాలు అడిగారు. పెళ్ళయిన ఈ నెలరోజుల అనుభ వాన్ని పురస్కరించుకుని వైవాహిక జీవితం గురించి నా అభిప్రాయం అడిగారు. ఏమని చెప్పను ?

మోహనరావు నవ్వుతూ అన్నాడు :

"పోనీలేండి. మిమ్మల్నింకేం ప్రశ్నించం. సరైన అభిప్రాయం చెప్పటానికే సిగ్గుపడిపోతున్నారాయె"

"దట్సాల్ మై డియర్ ఫ్రెండ్స్ ! టేక్ యువర్ సీట్స్ ఎండ్ మైండ్ యువర్ వర్క్స్" మధుసూదనం ఆజ్ఞ జారీచేశాడు.

ఆ మాట వినడంతో ఆఫీసు బృందమంతా నవ్వుకుంటూ ఎవరి స్థానానికి వాళ్ళు వెళ్ళిపోయారు.

తర్వాత తెలిసింది —కొత్తగా వచ్చిన హెడ్‌గుమాస్తాను అనుక

రిస్తూ మధుసూదనం అలా అన్నాడని. మధుసూదనానికి ఇలాంటి 'అను కరుణ' అంటే సరదా హెచ్చు.

దాదాపు పదకొండు గంటల క్కాబోలు కొత్త ఆఫీసరు ఆఫీసుకు వచ్చారు. హెడ్‌గుమాస్తాతో అయిదు నిమిషాలపాటు ఏదో మాట్లాడి తన గదిలోకి వెళ్ళిపోయారు. ఆయన హుందాతనం నన్ను బాగా ఆకర్షించింది.

బాగా పొడగరి. పొడుక్కితగ్గ లావు. నిండు సూట్లో చూడటానికి ముచ్చటగా వున్నారు. చూస్తుండగానే సిగరెట్ ముట్టించారు.

ఆయనకు పాతిక సంవత్సరా లుంటాయేమో.... ఇంత చిన్న ప్రాయంలోనే ఆయన ఆ స్థాయిని అందుకోడం ముదావహం.

మధుసూదనం నావైపు తిరిగి 'ఈయనే మన కొత్త ఆఫీసరు' గారు అని తను చూపుద్వారా తెలియజేశాడు.

ఆఫీసరు వచ్చిన తరువాత అంతకు మునుపున్న అలజడి తగ్గింది. ఆఫీసంతా నిశ్శబ్దాన్ని పులుముకున్నది. ఎవరిపనిని వాళ్ళు మౌనంగా చేసుకుంటున్నారు.

అరగంట గడిచిన తర్వాత రాజన్న నా స్థానం దగ్గరికి వచ్చాడు.

"మిమ్మల్ని అయ్యగారు పిలుస్తున్నారు" అని చెప్పాడు.

ఆయన నన్నెందుకు పిలిచారో అర్థంగాక రాజన్నవెంట ఆఫీసరు గదిలోకి వెళ్ళాను. ఆయన నన్ను చూస్తూనే అన్నారు—

"విష్‌యూ ఎ హేపీ మేరీడ్ లైఫ్"

"థాంక్యూ సార్ !"

"మీరు యివ్వాళ ఆఫీసుకొచ్చినా మీ గురించి యింతకుమునుపే విన్నాను. మన ఆఫీసులో బాగా పనిచేసేవాళ్ళల్లో మీరూ ఒక్కరుట. అందుకు తగ్గట్టు మీ సీట్లో హెవీ డిస్పోజల్స్ వుంటాయిట. అది మంచిది.

నియమించిన పనిని సక్రమంగా చేసుకుపోతే మీకు మంచి భవిష్యత్తు వుంటుంది. అవసరమైనప్పుడు నా పూర్తి సహకారం మీకు వుంటుంది"

"కృతజ్ఞుణ్ణి"

ఆయన మాటలు వింటూంటే అమితానందమయింది. పరిచయమైన మరుక్షణంలో ఆయనకు నామీద సదభిప్రాయం కలగడం ఆశ్చర్యమే మరి!

"మీరు కథలు రాస్తారని విన్నాను. మీ కథలు కొన్ని చదివినట్టు జ్ఞాపకం. ఈ ఆఫీసుకొచ్చే ముందు యిక్కడి సిబ్బంది పైన నా కెలాంటి అభిప్రాయమూ లేదు. ఇక్కడ యింత చక్కటి వాతావరణం ఉంటుందనుకోలేదు. సిబ్బంది కార్యక్రమాలు నన్ను బాగా ఆకర్షించాయి. ప్రజ్ఞగల యువకులు ఈ ఆఫీసులో సగానికిపైగా వున్నారని తెలిసిన తర్వాత గర్వించక తప్పటంలేదు"

ఆయన రసహృదయాన్నీ, సౌమ్య దృష్టినీ లోలోన అభినందించాను. లోకంలో వున్న 'మంచితన'మంతా ఈయనలో మూర్తీభవించిందా అనిపించింది. అందరూ యిలాంటి ఆఫీసర్లే వుంటే?

వచ్చి నా స్థానంలో కూర్చున్నమీదట నా ముందున్న ఫైళ్ళు, వగైరాలు అతిస్వల్ప విషయాలుగా కనిపించాయి. ఆఫీసరు ప్రోత్సాహం ఎంతపనైనా చేయించగలదు.

పది నిమిషాల తర్వాత మధుసూదనం నా స్థానం దగ్గరికి వచ్చాడు. ఆఫీసరు నాతో అనిన మాటలన్నీ చెప్పాను. అతను అంతా విని—అన్నాడు.

"అలాటి మంచి మనిషిలో కొన్ని లోపాలను దేవు డెందుకు సృష్టిస్తాడో అర్థంకాదు రావ్!"

"అంటే?"

"నింపాదిగా నువ్వే అన్నీ తెలుసుకుందువుగాని. ఆయన గురించి తెలిసిన 'చెడు' చెప్పటానికి నా మనసు వొప్పుకోడంలేదు."

ఘర్షణ ప్రారంభమయింది. చేద్దా మనుకున్న పని కాస్త ఆగిపోక తప్పిందికాదు. మంచీ చెడుల రూపాలు ఎలా ఉంటాయి? అసలు మంచేవిఁటి ? చెడేవిఁటి ? వాటి రెంటికీ సరిహద్దు ఎక్కడ? ఆఫీసర్లో దాగిన లోపాలంటే ?—

కాఫీ కొరకు బయటి కొస్తుండగా, నా ముందునుంచే ఒక అధునాతన యువతి గబ గబా ఆఫీసులోకి వచ్చింది. చేతికున్న వాచీలో టైము చూచుకుంది. ఎవరి అనుమతితో సంబంధం లేకుండానే ఆఫీసరు గదిలోకి వెళ్ళింది.

అప్పటివరకూ ఆఫీసర్తో మాట్లాడుతున్న హెడ్‌గుమాస్తా ఆఫీసరు గదిలోండి బయట కొచ్చేశాడు. ఈ హఠాత్పరిణామం ఆఫీసంతట్నీ ఆకర్షించింది. అందరూ ఆఫీసరు గదిపైన చూపులు నిలిపారు.

మధుసూదనం నా దగ్గరకు వచ్చి—

"క్యాఫికా ?" అని అడిగారు.

"అవును"

"పద వెడదాం" అని నాతోపాటు అతనూ కాంటీన్‌కి వచ్చాడు. కాఫీ తాగుతూ అతనే అడిగాడు :

"ఇప్పుడు ఆఫీసుకి వచ్చినావిడ ఎవరో తెలుసా ?"

తెలీదన్నట్టు తలూపాను.

"ఆఫీసరు వుంపుడుగత్తె !"

"ఏమిటి ?"

"ఎవరికీ తలొంచడం చేతగాని ఆఫీసరు ఈవిడకు దాసోహ

మంటున్నారు. ఈవిడ స్నేహంతో సర్వవిధాలా చెడిపోవటానికి సిద్ధపడుతున్నారు. వాళ్ళిద్దరికీ కాలేజీ రోజుల్లోనే కొంత గ్రంథం నడిచినట్లు వినికిడి. ఆవిడకు పెళ్ళయింది కూడాను! ఆయన లాయరుట! ఈ ప్రేమ విషయం ఆయనగ్గూడా తెలుసునట! పెద్దలు బ్రదర్! అంతా పెద్దలే!"

మధుసూదనం ఆఫీసరు గురించి చాలా చెప్పుకుపోతున్నాడు. ఎందుచేతనో మరి, ఆఫీసరు గురించి 'చెడు' వినబుద్ధి పుట్టడంలేదు.

చివరికి మధుసూదనం అన్నాడు—

"ఈఒక్క అవలక్షణం మినహా ఆఫీసర్లో కాగడాపెట్టి వెతికినా మచ్చ కనుపించదు. మన గుమాస్తా లందరికీ ఆయన ధర్మరాజు! ఏదీ పట్టించుకోరు. చాతనైతే మేలు చేయడానికి సిద్ధపడతారు కాని ఒకడికి కీడు చేద్దామన్న తలంపే లేదాయనకు. మరొకడూ, ఇంకొకడూ అయితే విచారించం కాని, సాక్షాత్తూ యింత మంచి మనిషి దిగజారి పోతున్నారంటే జాలిగానే వుంటుందిమరి."

నాకై నేనేమీ మాట్లాడలేదు. కాఫీ ముగిసిన తర్వాత ఆఫీసుకి వచ్చాము. మేము వస్తూండగా మళ్ళీ ఆవిడ మాకు ఎదురుపడింది. అందమైన మనిషి!

నేను నా స్థానంలో కూర్చున్న తర్వాత మధుసూదనం మళ్ళీ పిలిచాడు. చిరాకుతో అతని స్థానం దగ్గరికి వెళ్ళాను.

"సారీ బ్రదర్....నీకో ఉత్తరం వచ్చి చాలా రోజులయింది. అది నీకు అందజేద్దా మనుకునే యిప్పటివరకూ వాయిదా వేశాను. ఇంద"

అతను యిచ్చిన ఉత్తరం తీసుకు వచ్చేశాను. నా స్థానంలో కూర్చుని ఉత్తరం విప్పాను:

'శ్రీ రావుగారికి,

నాన్నగారికి ఓ పదిరోజులనుండీ గుండెల్లో విపరీతమైన పోటు వస్తున్నది. ఈ కారణంచేతనే మే మెవ్వరమూ మీ పెళ్ళికి రాలేక పోయాము.

ముందు ఈ విషయాన్ని మీకు తెలియజేయ వద్దన్నారు. కాని.... యివ్వాళ గుండె నొప్పి ఉధృతమయింది. మీకు ఉత్తరం వ్రాయమని స్వయంగా ఆయన చెప్పడంతో రాస్తున్నాను. మీ పెళ్ళి పనులన్నీ సక్రమంగా ముగిసిన తర్వాత వీలు చేసుకుని ఒకసారి రావలసిందిగా నాన్న మిమ్మల్ని ఆహ్వానిస్తున్నారు.

చివరిసారిగా మిమ్మల్ని చూడాలని వుందిట.

మీ నిరంజనం.'

ఉలిక్కిపడ్డాను. ఆ చివరి వాక్యం నా నవనాడులన్నీ కృంగదీసింది. ఆయన శరీరస్థితి ఎలా వుంది ? ఇంతకుముందు వచ్చిన ఉత్తరాల్లో ఏనాడూ ఆయన ఈవిధంగా రాయలేదు. ఉత్తరం చదువుతూన్న ప్రతిమాటా ఆందోళన ఉధృతమవుతోంది. ఆ చివరి వాక్యాన్ని పదే పదే చదువుకుంటూ అర్థాన్ని నాకు తోచిన విధంగా సమన్వయించుకోడం తప్ప మనసుని కుదుట పరచుకోలేక పోతున్నాను.

ఉత్తరాన్ని తీసుకుని ఆఫీసరు గదిలోకి వెళ్ళాను. నా ఆదుర్దాని గమనించి, నన్ను చూడగానే అడిగా రాయన :

"సెలవు కావాలా ?"

అవునన్నాను ఆశ్చర్యపోతూ.

"పెళ్ళయిన తర్వాత మనిషికి బాధ్యతలు పెరుగుతాయిట. సరే మీరిక వెళ్ళచ్చు."

సెలవు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు చెప్పి వచ్చేశాను.

రెండు రోజుల సెలవు రాసి హెడ్‌గుమాస్తా చేతికిచ్చాను. సెలవు కాగితాన్ని తీసుకుంటూ నవ్వుకున్నా రాయన.

* * * *

ఆ సాయంత్రం పెందరాడే గదికొచ్చాను.

తలుపుతీసి రెండు జతల బట్టలు సూటుకేసులో సర్దుకుంటూంటగా రుక్మిణమ్మగారు వచ్చారు. గుమ్మం దగ్గరే నిలబడి—

"నీకు కొత్తకళ వచ్చేసింది సుమా! తాతయ్యగారు నిన్ననే ఊరు వెళ్ళారు. ఆయన నిన్ను చూడాలని తహతహలాడుతున్నారు" అన్నది నవ్వుతూ.

నా ముందే ఆవిడ అలా మాటాడ్తూంటే సిగ్గు పుట్టుకొచ్చింది. తల వంచుకున్నాను.

"తల దించుకుంటా వెందుకోయ్ పెళ్ళికొడుకా? మరీ ఆడపిల్లలా అంత సిగ్గయితే ఎలా నాయనా....తలెత్తు....అన్నట్టూ....మీ ఆవిడ నెప్పుడు తీసుకొస్తావూ?"

"నా కా విషయాలు తెలీవండి."

"ఈ ఇంట్లోనే మరో భాగం నీకు యిద్దును కాని, నీ కది చాలదేమో ననుకుంటున్నాను."

"అప్పుడే ఈ విషయా లెందుకులెండి?"

"బలేవాడివేలే .... సంసారమంటే బొమ్మలాట అనుకున్నావా నాయనా? అందులో కొత్త సంసారం కూడాను. అన్నీ అందుబాటులో వుండాలి. ఏ లోటూ రాకుండా చూచుకోవాలి. అప్పుడే సుఖం. ఉండు.... ఒక్క నిముషం....ఇప్పుడే వస్తాను" అంటూ ఆవిడ వెళ్ళారు.

రుక్మిణమ్మగార్కి ఏభై సంవత్సరాలు దాటాయి. ఆవిడకు పిల్లలు లేరు. వాళ్ళింట్లో అద్దెకుంటూన్న మమ్మల్నే తన పిల్లలుగా

చూచుకుంటున్నారంటే ఆశ్చర్యంలేదు. అన్నివిధాలా మాకు చేదోడు వాదోడుగా ఉంటున్నా రా దంపతులు !

నాతోపాటు మరో ముగ్గురు మిత్రులు ఈ గదిలో వుంటున్నారు. నలుగురం కలిసి చదువుకున్నాం. అదృష్టవశాత్తు నలుగురికీ యిక్కడే ఉద్యోగాలు కావటం మూలంగా అందరం ఒకే గదిలో వుంటున్నాం. మా మధ్య ఎన్నడూ పొరపొచ్చాలు రాలేదు. అందరం కూడా వొకే మాటమీద నిలబడి ఉంటున్నాం ఇంతవరకూ. మేమంటే గిట్టని చాలా మంది మా స్నేహాన్ని చూచి ఈర్ష్యపడటం కూడా కద్దు. ఈ స్నేహాన్ని చెడగొట్టాలని ప్రయత్నాలు కూడా జరిగాయి. కాని—వాళ్ళకి అలాంటి అవకాశాన్ని ఇవ్వలేదు.

మరో అరగంటలో రైలుంది. ఈ రైలెక్కితే యీ రాత్రికే చేరుకోవచ్చు. కాని, ఊరువచ్చి కూడా మిత్రులకి కనుపించకుండానే వెళ్ళిపోవడం బాధగా ఉన్నా—వెళ్ళక తప్పడంలేదు.

రుక్మిణమ్మగారు నాకోసం రెండు లడ్డులు తెచ్చారు. అవి నా చేతికిస్తూ....

"ఇవి పుచ్చుకో బాబూ....నీ జీవితంలో వందేళ్ళూ ఇంత తాపీగానే గడవాలని ఆశిస్తూన్నాను" అన్నా రావిడ.

కృతజ్ఞతా పూర్వకంగా ఆవిడకు నమస్కరించాను. ఆవిడ కళ్ళల్లో లీలగా కన్నీరు తొణికిసలాడింది.

"మిమ్మల్ని చూస్తోంటే ఏదో వాత్సల్యం పుట్టుకొస్తూంటుంది. ఇది చూచి నవ్వుతారు. నాదంతా పిచ్చని అంటారు, నీకు తెలీదుగాని ఆయనకూ్కడా పిల్లలంటే విపరీతమైన మోజు."

నవ్వి ఊరుకున్నాను. ఆవిడ నా పక్కనున్న సూటుకేసు చూచి అడిగారు :

"ఏదైనా ఊరు........"

"అవునండి. అత్యవసరంగా రాజమండ్రి వెళ్ళాల్సి వచ్చింది. ఈ విషయం మావాళ్ళకి చెప్పండి. మళ్ళా రెండు రోజుల్లో వచ్చేస్తానని చెప్పండి"

"అలాగే...."

ఆవిడ దగ్గర సెలవు తీసుకుని స్టేషనుకు వెళ్ళాను. ప్లాటుఫారం మీద రైలు సిద్ధంగా ఉంది. టిక్కట్టు తీసుకుని రైలెక్కాను.

రైలు కదిలింది!

మేము స్థితిపరులం కాదు. నాన్న సంపాదనలో చాలా భాగం అక్కయ్యల పెళ్ళిళ్ళకే ఖర్చయింది. తాతగారు నాన్న కిచ్చిన అయి దెకరాల మాగాణి, మా స్థిరాస్తి. సాలీనా దానిమీద వచ్చే ఆదాయం, నాన్న జీతం - ఈ రెంటితో మా సంసారం ఏ వడీదుడుకూ లేకుండా సాగింది. అక్కయ్యలకు వాళ్ళ అదృష్టంకొద్దీ మంచి సంబంధాలే దొరికాయి. పండుగలకూ, పబ్బాలకూ వాళ్ళంతా వస్తే, ఉన్నదాంట్లోనే సంతృప్తి పరచేవారు నాన్న.

నాన్నకి అభిమానం జాస్తి. ఏ విషయంలోనూ ఆయన ఒకళ్ళని ఆశ్రయించటమంటే తల తీసినంతగా బాధపడేవారు. ఉన్నదే స్వర్గమనుకునేవారు నాన్న.

నేను బి.కాం. పాసయ్యి సంవత్సరంపాటు ఖాళీగావున్నా.ఆయన కించిత్తయినా చలించలేదు. ఆయనకున్న పరపతి నాకు ఉద్యోగం క్షణంలో వేయించగలదు. కాని—దీనిద్వారా అవతలివాళ్ళకి చులకనవటం ఆయనకు ఇష్టంలేదు.

'నీ అర్హత గమనించి నీకు ఉద్యోగం ఇవ్వగలిగినవాడే ఇస్తాడు. లేదూ - ఉన్న ఆ కొద్ది భూమినీ సాగు చేసుకుందువుగానీ.'

ఎప్పుడు నా ఉద్యోగం ప్రసక్తి వచ్చినా - ఆయన ఈ రెండు

ముక్కలూ చెప్పి ఊరుకునేవాళ్ళు. చదువుకుని ఉద్యోగం చేద్దామను కుని దృష్టినంతా చదువుమీదనే లగ్నం చేసినవాళ్ళకి మళ్ళీ సేద్యం చెయ్యాలంటే తలకు మించిన పని. ఈ విషయాన్ని కూడా ఆయన పట్టించుకోలేదు.

నిరుద్యోగిగా ఒక సంవత్సరంపాటు అతి కష్టంగా గడిచింది నాకు. ఒక్క ప్రియత్నం కూడా సమకూడి రాలేదు.

సరిగ్గా అలాంటి సమయంలోనే ఆయనతో నాకు పరిచయం కలి గింది. మా పరిచయం ఎలా జరిగిందో తలచుకుంటూంటే యిప్పటికీ చిత్రింగా వుంటుంది నాకు.

మా ఊరు విశాలమైన మైదానాలకు ప్రిసిద్ధని బందరు తెలిసిన చాలామంది వప్పుకుంటారు. ప్రికృతి సిద్ధమైన ఈ మైదానాల ముందు కృత్రిమమైన ఉద్యానవనా లెందుకూ పనికిరావంటే సత్యదూరం కాదు. ప్రితిరోజు సాయంత్రిలు ఆ మైదానాల్లో కూర్చునేందుకు చాలామంది వస్తూండేవారు.

అక్కడికి వచ్చి నే కూర్చున్న తరువాత ఓ పది నిముషాలకు 'ఆయన' వస్తుండేవారు. నా ముందునుంచే వెళ్ళి, నాకు పది అడుగుల దూరంలో వత్తుగా పెరిగిన పచ్చిగడ్డిపైన కూర్చుండేవారు. నా ముందు ఆయన చాలా చిత్రిమైన మనిషి.

కూర్చున్న క్షణంనుంచీ ఆకాశంవేపూ, చుట్టు ప్రిక్కల స్థలాల వేపూ, మా ముందున్న తారురోడ్డు వేపూ ఆత్రింగా చూచేవారు. అలా ఓ అరగంటపాటు గడిపి వెళ్ళిపోయేవారు.

ప్రితిరోజూ ఆయన తప్పకుండా హాజరయ్యేవారు. అదేచోటులో కూర్చునేవారు । అలాగే చూస్తుండేవారు.

ఒకటి రెండు రోజులు ఆయన ఏ కారణంచేతనైనా రాకపోతే

ఆరోజు నాకసలేమీ తోచేదికాదు. రోజుకంటె పావుగంట ముందే యింటికి వెళ్ళిపోయేవాడిని. ఆయనకూడా యింతేనేమో !

అలాంటిది ఆయన వారంరోజులపాటు రాకపోయేసరికి పిచ్చెత్తి నట్టయింది. ఎప్పటికప్పుడు ఈరోజైనా ఆయనొస్తే బావుండే దనిపించింది. వచ్చేవారు కాదు. అక్కడికీ ఒక పావుగంటా, అరగంటా కేవలం ఆయనకోసం ఎదురుచూస్తూ గడిపేవాడిని.

పదిరోజుల వరకూ ఆయన నాకు కనిపించలేదు.

ఏదో పోగొట్టుకున్న ట్టనిపించేది. అంతా వెలితిగా కనిపించేది.

ఆయ నెవరు ? నే నెవర్ని ? ఆయన నాకు కనిపించకపోతే మునిగిపోయేదేమి టసలు ? - నాకు నేనె కొత్తగా కనుపిస్తూన్నాను.

ఒకరోజు నే నక్కడ కూర్చుని ఉండగా ఒక అపరిచిత వ్యక్తి నా దగ్గరకు వచ్చాడు. నన్ను చూస్తూ....

"మీరేనా బాబూ....రోజూ యిక్కడ కూకుండేది ?"

"ఏం....ఏం కావాలి ?"

"మిమ్మల్ని అయ్యగారు యెంటబెట్టుకు రమ్మన్నారు."

"ఎవరు మీ అయ్యగారు ?"

"అయ్యగారు కూడా ఈడనే కూకుండేవారు. అయ్యగార్కి వంట్లో బాగోలేదు. మిమ్మల్నెంంటెట్టుకు రమ్మన్నారు."

ఆయనే ! ....ఆయనే నన్ను పిలిపించారు. ఆశ్చర్య మనిపించింది. వచ్చినతన్ని మౌనంగా వెంబడించాను.

అతను ఆ దగ్గర్లో వున్న వో డాబా యింట్లోకి తీసుకెళ్ళాడు. ఇల్లు అందంగా అలంకరింపబడి వుంది. చుట్టూ ప్రహరీ - అందమైన క్రోటన్సూ - వీధి గుమ్మానికి చక్కటి డిజైనుతో వున్న తెర.

వరండాలో నాలుగు పేము కుర్చీలూ, వాటిమధ్య టీపాయ్.

నావెంట వచ్చిన వ్యక్తి లోపలికివెళ్ళి మళ్ళీ వచ్చి అన్నాడు :

"రండి. అయ్యగారు రమ్మంటున్నారు"

లోపలికెళ్ళాను. ఆయన పడకకుర్చీలో కూర్చుని పేపరు చదువు కుంటున్నారు. ఈ పదిరోజుల్లోనూ ఆయన బాగా చిక్కిపోయినట్టు కను పిస్తున్నారు. నన్ను, నవ్వుతూ ఆదరంగా ఆహ్వానించారు.కూర్చునేందుకు కుర్చీ చూపించారు. నే కూర్చున్న తర్వాత అన్నారు :

"నా పేరు సీతారామయ్య"

ఆయన మంచి హోదాలో వున్న అధికారిట. రాజమండ్రి నుండి యిక్కడికి మొన్ననే బదిలీ అయిందిట ఈ ఊరి పరిసరాలు యింకా క్రొత్తగా కనిపిస్తున్నాయిట. కాని యిక్కడి వాతావరణం తనలాటి జబ్బు మనుష్యులకి మంచిదిట. ఇలా ఎన్నో విషయాలు చెప్పి చివరిన అన్నారు :

"రత్నాల్లాటి పిల్లలూ, ఆస్తీ, హోదా అన్నీ వున్నాయి నాయనా. కాని....నా ఆరోగ్యం రోజు రోజుకీ అధ్వాన్నంగా తయారవుతోంది. ఈ దిగులే నన్ను కృంగదీస్తోంది. అలా రెండు మూడు ఫర్లాంగులు ప్రతిరోజూ నడవమని డాక్టరు సలహా యిచ్చాడు. అతని మాటలను తూ. చ. తప్పకుండా పాటిస్తున్నాను. నిన్ను రోజూ చూస్తున్నాను. తెలీ కుండానే నీతో పరిచయం చేసుకున్నంత పనయింది. ఈ పదిరోజులూ ఎక్కిన మంచం దిగలేదు. చిరాకూ, విసుగూ కలిగాయి. నువ్వు అక్క డికి వచ్చి వుంటావని భావించి, నాతో కాసేపు మాట్లాడతావనే ఉద్దే శ్యంతో నీకు కబురంపాను"

నాపేరూ, వివరాలూ వగైరా అడిగారు. అన్నింటికీ జవాబు చెప్పాను.

"మా అబ్బాయి నిరంజనం రాజమండ్రిలో హాస్టల్లో వుండే

చదువుకుంటున్నాడు. నా బదిలీలతో వాడి చదువు చెడిపోవడం నా కిష్టం లేదు. పెద్దమ్మాయి రాధ అత్తవారింట్లో వుంటున్నది. ఇకపోతే నేనూ, మా ఆవిడా, రెండో అమ్మాయి కుసుమా యిక్కడ వుంటున్నాం"

ఇది చెప్పిన తర్వాత రెండు క్షణాలు ఆగి, మళ్ళా నవ్వుతూ అన్నారు :

"కబుర్లు చెప్పుకునేందుకు సరైన నేస్తం దొరకలేదు. ఆఫీసులో వాళ్ళు ఇంటికొచ్చి కబుర్లు చెప్తారనే నమ్మకం నాకు లేదు.వాళ్ళకి కావలసింది ఆఫీసులో రగుల్తూన్న రాజకీయాలూ, నా మెచ్చుకోలూనూ. అందుచేతనే నిన్ను వెదుక్కున్నాను. నీతో స్నేహం చెయ్యాలని నిశ్చయించుకున్నాను"

ఆరోజు ఆయనే ఎక్కువసేపు మాట్లాడారు. అది లగాయితూ ప్రతిరోజూ ఆయన్ను కలుసుకునేవాడిని. పెద్దవారు, లోకానుభవం వున్నవారు కాబట్టి తరచూ ఆయన వక్త, నేను శ్రోతనూ. ఆయన ప్రతి విషయాన్నీ కూలంకషంగా పరిశోధించినట్టు చెప్పేవారు.ఆయన భావాలు తెలుసుకోడం మాత్రం నా వంతయ్యేది.

ఒకోసారి మైదానల్లోనూ, మరోసారి వారి యింట్లోనూ, తప్పని సరైతే సాక్షాత్తూ వాళ్ళ ఆఫీసులోకూడా మా సమావేశం జరిగేది.

నన్ను ఇద్దరు ముగ్గురు స్నేహితులు అన్నారు కూడాను—

"నీకేమిటోయ్ అధికారిని జేబులో పెట్టుకున్నావ్. నువ్వు నోరు తెరుచుకుని అడగాలేగాని నీకు ఉద్యోగం వాళ్ళ ఆఫీసులో క్షణాలమీద రాదూ...." అని.

కాని ఆయన మనస్తత్వం వాళ్ళకు తెలీదు.ఆయన అంత త్వరగా 'మనిషి'ని నమ్మరు. ఒకసారి కుసుమ పెళ్ళి విషయమై ఆయన నాతో యిలా అన్నారు :

"కుసుమ దురదృష్టవశాత్తు పక్షవాతానికి గురై చేయి పోగొట్టు కుంది. ఈ అంగవైకల్యం కుసుమ రూపాన్ని సైతం కించపరుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆ పిల్లకి త్వరగా పెళ్ళవుతుందని నే ననుకోను. ఒకవేళ పెళ్ళయినా ఆ పెళ్ళితో సుఖపడుతుందంటే నాకు నమ్మకం చాల దంలేదు. కుసుమకి చాలా మంచి సంబంధాలే వచ్చాయి. కాని వాళ్ళని చూస్తోంటే కేవలం నా డబ్బూ, హోదా మీదనే ప్రేమున్నట్టు కని పిస్తుంది. కాని, నా పిల్లమీద ప్రేమున్నట్టు కనుపించడం లేదు. అందు చేతనే వచ్చిన ప్రతి సంబంధాన్నీ నేనే చెడగొట్టేస్తున్నాను. పిచ్చిపిల్ల- ఈ చర్యకి ఎంత తల్లడిల్లిపోతుందో రావ్ !"

అమకే అంటాను ఆయన ఎవర్నీ అంత త్వరగా నమ్మలేరని. ఇలాంటి పరిస్థితుల్లో నాకు మీ ఆఫీసులో ఉద్యోగం వేయించండని అడి గితే నన్నేవిధంగా భావిస్తారో కదా ! కేవలం ఉద్యోగం కోసరమే నేను ఆయన స్నేహాన్ని వాంఛిస్తూన్నానని ఆయన అనుకుంటే, అంతకంటె ఘోరం మరొకటిలేదు. అలాంటి అవాంఛనీయమైన పరిస్థితి రాకూడదనే భగవంతుణ్ణి ప్రార్థిస్తాను.

కాని పరిచయస్థులు మా స్నేహానికి విపరీతార్థాలు తీస్తూనే వున్నారు. కాటికి కాళ్ళుచాపి చావుకోసం ఎదురుచూస్తోన్న పెద్దమనిషితో రెండు పదులు నిండిన యువకుడికి స్నేహమేమిటి వల్లకాడూ, ఈ స్నేహం వెనుక 'స్వార్థం' తప్పకుండా ఉండి వుంటుందని నా మొహం ఎదటనే అనేవారు. విని బాధపడేవాడిని. అంతేగాని ఆయన స్నేహం నుంచి తప్పుకోడం నా చేతకాదు.

ఒకసారి లోగడ వచ్చినట్టే ఆయనకు గుండె నొప్పి వచ్చింది. ఈమాటు ఉధృతంగా వచ్చింది. మా యిద్దరిమధ్యా వున్న అనుబంధం ఆయనకు నాచేత సపర్యలు చేయించింది. రెండురోజులపాటు కుసుమా,

నేనూ ఆయన మంచాన్ని అంటిపెట్టుకుని కూర్చున్నాం. ఆయన స్థితి బాగుపడ్డ తర్వాత కళ్ళను నీటితో నింపుకుని నన్నుద్దేశించి అన్నారు— 'నువ్వు దేవుడివి నాయనా !' అని.

సీతారామయ్యగారి పరిచయస్తులతో నన్ను తనకు ప్రాణం ఇచ్చే మిత్రునిగా పరిచయం చేశారు. ఆయన మిత్రులు కళ్ళింతవి చేసుకుని అర్థంకానట్టు ఆయనవైపు చూశారు. వాళ్ళలా చూస్తోంటే నాకు సిగ్గనిపించింది కూడా.

ఇంటర్వ్యూల నిమిత్తం హైదరాబాద్ వెళ్ళడం అది మూడోసారి. నాన్నని అడిగాను. 'నీ యిష్టం. పైకం కావాలిస్తే మీ అమ్మనడుగు' అని చెప్పి ఆయన ఆఫీసుకు వెళ్ళిపోయాడు. ఏమైనాసరే ఈ ఇంటర్వ్యూతో అటు ఉద్యోగమో, యిటు సేద్యమో తేల్చుకోవాలని నిర్ణయించుకుని అమ్మని డబ్బడిగి తీసుకొని హైదరాబాద్ వెళ్ళాను.

ఉద్యోగం గగన కుసుమమైంది. వచ్చిన ఏభైమంది అభ్యర్థుల్లోనూ ముగ్గుర్నే అర్హులుగా పరిగణించింది. ఆ ముగ్గురికీ ఉద్యోగాలు యిచ్చారు. మరొక అనుభవాన్ని గడించి యింటికి వచ్చాను.

సీతారామయ్యగారు ఆ మూడు రోజులనుండీ ఎందుకు కనిపించలేదని అడిగారు. నా హైదరాబాదు ప్రయాణమూ, దాని ఫలితమూ వివరించి చెప్పాను రెండు నిమిషాలు ఆయనేదో ఆలోచించి నన్ను అడిగారు:

"ఇంకా యిలా నిరుద్యోగిగా ఎన్నాళ్ళుండ దలిచావు?"

"అది మన చేతుల్లో ఉన్నదాండి ?"

"పిచ్చివాడా ! ప్రయత్నాలు చెయ్యాలే కాని, మనిషి సాధించలేని విషయమంటూ ఏదీ లేదు. రేపు ఒక అప్లికేషను రాసి నా చేతికివ్వు. మా ఆఫీసులోనే ప్రయత్నిస్తాను. చూద్దాం. నా చేతనయినంత వరకూ నేను ప్రయత్నిస్తాను. సరే"

నే నేమీ మాటాడలేదు.

ఆ తర్వాత రోజుకూడా అప్లికేషను గురించి అడిగారు. నా ఉద్యోగ ప్రయత్నం ఆయన చేతులమీదుగా జరగడం నా కిష్టంలేదు. అయినా, ఆయన బలవంతంమీద అప్లికేషను రాసివ్వక తప్పిందికాదు.

నెలరోజులు తిరక్కుండానే నాకు బెజవాడ బ్రాంచిలో ఉద్యోగం వచ్చింది. సీతారామయ్యగారికి నా ధన్యవాదాలు చెప్పుకున్నాను. ఆయన నా భుజాన్ని తట్టుతూ అన్నారు:

"చక్కగా ఉద్యోగం చేసుకో. పైకి రావడానికి ప్రయత్నాలు చెయ్యి. ఏది ఏమైనా మన స్నేహాన్ని మాత్రం మరచిపోకు."

ఆయన సహృదయత్వం, స్నేహంమీద ఆయనకు గల గౌరవ భావం నన్ను ముగ్ధుణ్ని చేశాయి.

జీవితంలో నన్నొక ఉద్యోగిగా స్థిరపరచింది సీతారామయ్యగారు. ఆయన చేసిన ఈ మహోపకారాన్ని మరో జన్మలో కూడా మరిచి పోలేను.

బెజవాడ వెళ్ళిన తర్వాత ఉత్తరాలు రాస్తుండేవాడిని. ఆయన సమాధానాలు వ్రాస్తుండేవారు. ఆయన రిటైరవడం, రాజమండ్రిలో స్థిర నివాస మేర్పరచుకోవడం అన్నీ ఈ ఆరు నెలల్లో జరిగాయి.

నా పెళ్ళికి వారం రోజుల ముందు ఆయనకు ఓ ఉత్తరం రాశాను; తప్పకుండా రావలసిందిగా ఆహ్వానిస్తూ. దాని కాయన చాల చక్కటి సమాధానం రాశారు. నేను ఓ యింటివాడి నవుతున్నానని తెలిసి ఆయన ఆనందిస్తున్నారట. పెళ్ళికి తప్పకుండా వస్తున్నట్టు రాశారు. పెళ్ళయిన తర్వాత వీలుంటే నా భార్యను వెంటబెట్టుకుని రావలసిందిగా ఆహ్వానించారు.

* * *

సీతారామయ్యగారింట్లో ఇంకా దీపం వెలుగుతూనే ఉంది. రిక్షా దిగాను. నిరంజనం ఆ యింటిముందు నిలబడి వున్నాడు. అతన్ని చూడ గానే ఏదో కీడు శంకించాను. "నాన్నగారు కులాసా ?" అని అడిగాను. అతను ముఖాన్ని దించేసుకుని గబ గబా ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

అతని వాలకం నన్ను కలవర పరచింది. ఇంట్లో అడుగు పెట్ట గానే పార్వతమ్మగారూ, కుసుమా, రాధా ఏడ్వడం మొదలుపెట్టారు.

అలాగే అక్కడే ఉన్న కుర్చీలో కూలబడి పోయాను.

నిరంజనం నా దగ్గరకు వచ్చి అన్నాడు—

"ఆయన పోయేముందు మీ గురించి అడిగారు—" అతను పసి పిల్లాడిలా వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

ఆ మాటతో నా తల దిమ్మెత్తిపోయింది. చేతుల్తో తలను గట్టిగా పట్టుకున్నాను. సీతారామయ్యగారి రూపం నా ముందు తచ్చాడుతూనే వుంది.

* * *

గోదావరి గంభీరంగా వుంది.

చాలాదూరం నడిచి వచ్చాను. ఎన్నో స్మృతులు, ఆయన వ్యక్తి త్వం, మా స్నేహం, గడిచిన రోజులు యివన్నీ నన్ను కలవర పెడు తున్నాయి.

ఆయన యిక లేరు ! ఆ స్నేహం ఇక తిరిగిరాదు.

నిరంజనం యింకా చదువుకునే కుర్రాడు. కుసుమకి పెళ్ళి కాలేదు. వ్యవహార దక్షత తెలిసిన యింటిపెద్ద లేనప్పుడు ఆ కుటుంబం ఎన్ని అవస్థలు పడాలో కదా ?

ఆయ నొకసారి నాతో అన్నారు—

"నిరంజనం చదువు పూర్తయి, నాలుగురాళ్ళు సంపాయిస్తూ. కుసుమ పెళ్ళయి తన సంసారాన్ని చక్కగా దిద్దుకుంటూంటే నాకే

దిగులూ వుండదు రావ్! వచ్చే చావు అప్పటివరకూ వాయిదా వేసుకుంటే ఎంతో బావుణ్ణు!"

ఇది గుర్తుకురాగానే నాకు తెలీకుండానే ఏడుపొచ్చింది. హాయిగా బ్రతకటానికి నాకు అవకాశం కల్పించిన వ్యక్తికి నే నేవిధంగానూ సాయం చెయ్యలేకపోయాను. ఈ ఋణ విముక్తి ఈ జన్మకి లేదేమో!

చీకటి పడుతుండగా ఇంటిముఖం పట్టాను. మళ్ళీ ఉదయమే వెళ్ళిపోవటానికి నిశ్చయించుకున్నాను. దిగులుతో నిండిన ఆ ఇంట్లో యింకా నేనుండలేను. అనుక్షణమూ ఆయన గుర్తుకొస్తూ నా వల్లనయ్యే కార్యం ఒక్కటీ లేకపోగా, నా చేతగానితనం నన్ను గేలిచేస్తూ.....వద్దు.....నాకీ నరకం వద్దు.

ఆ ఇంటిముందు ఓ కారు ఆగివుంది. ఇంట్లో ఎవరిదో మగగొంతు వినిపిస్తోంది. మెల్లిగా నా గదిలోకి వెళ్ళాను. గదిలో కుసుమ కూర్చుని వున్నది. నన్ను చూడగానే లేచి నిలబడింది.

"ఇంతసేపూ ఎక్కడికి వెళ్ళి వచ్చారు? వుండండి. కాఫీ తెస్తాను" కుసుమ వెళ్ళిపోయింది.

పక్క గదిలోనుండి మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి—

"అయితే నువ్వు రానట్టేగా?"

"నన్ను బలవంతం చెయ్యకండి. ఇంతలో రాను."

"నీకేం తక్కువ చేశానని?"

"నా నోటితో చెప్పదలుచుకోలేదు. అంతా మీకు తెలుసు."

"మంచిది. నీ కెప్పుడు యిష్టమైతే అప్పుడే రా.....నిన్ను బాధ పెట్టను. వస్తా."

నాగది గుమ్మం దగ్గర నిలబడి ఆ వ్యక్తిని చూచాను. ఆశ్చర్యం మా ఆఫీసరు! నన్ను నేనే నమ్మలేకపోయాను.

కారు బయలుదేరిన శబ్దం విని రాధ గదినుండి బయటికి వచ్చి

వరండాలో నిలబడింది. అయిదు నిముషాలపాటు అక్కడే నిలబడి మళ్ళీ తన గదిలోకి వెళ్ళిపోయింది. వెళ్ళేముందు నావైపు చూచి తల దించుకున్నది.

"మా బావ వచ్చారు, అక్కయ్యని తీసుకెళ్ళేందుకు. కాని ఆయన పద్ధతి అసహ్యంగా తయారయింది. హోదాకు తగ్గ గుణం బావలో లేదు." కాఫీ యిస్తూ కుసుమ చెప్పింది.

"ఎవరికీ తలొంచడం చేతగాని ఆఫీసరు ఈవిడకి దాసోహ మంటున్నారు. ఈవిడ స్నేహంవల్ల సర్వవిధాలా చెడిపోటానికి సిద్ధపడు తున్నారు." మధుసూదనం మాటలు గుర్తుకొచ్చాయి.

"బావ ఈ హోదాకి చేరుకోవడంలో నాన్న కొంత సహాయం చేశారు. ఆ విశ్వాసం కూడా మరిచిపోయాడు బావ." కుసుమకూర్చుంటూ అన్నది.

రెండు క్షణాల తర్వాత మళ్ళీ ఆమే మాట్లాడింది.

"మీ పెళ్ళి రెండురోజు లుండనగా నాన్నగారు పోయారు. మీకు ఏ విషయమూ రాయవద్దని అంతకు మునుపే చెప్పారు. యిక్కడి విష యాల్తో మీ మనసు పాడవుతుందని ఆయ నుద్దేశ్యం."

"నాకు తెలుసు, ఆయన దైవస్వరూపులు."

"పోయేముందు అమ్మకో మాట చెప్పారాయన."

"ఏమని ?"

"...... ...... ...... ...... ......"

"చెప్పండి"

"ఈ ఇంట్లో నిరంజనానికి ఎలాంటి స్థానముందో మీకూ అదే స్థాన ముంటుందని అన్నారు." కుసుమ తన ముఖాన్ని చేతుల్లో దాచు కుంది.

కథా నిలయం
5309

మౌనంగా వుండిపోయాం. కాసేపటికి ఆమె వెళ్ళిపోయింది.

రాత్రి భోజనాలైన తర్వాత నా గదిలోకి వచ్చేస్తుండగా, రాధ నన్ను పిలిచారు. ఆవిడ గదిలోకి వెళ్ళాను.

"అలా కూర్చోండి. మీకు ఒక ముఖ్య విషయం చెప్పాలని వుంది."

"చెప్పండి" అన్నాను కూర్చుంటూ.

"ఏ విషయమైనా సరే కుండ బద్దలుకొట్టినట్లు,మనసులో ఉన్నది ఎదటివారికి చెప్పడం మంచిదంటాను. మీరేమంటారు ?"

"నిజమే...."

"మావారి దగ్గర నేను యిదే పద్ధతి ఆచరించాను. ఆయన మానసికంగా బలహీనులు. అది నాకు నచ్చదు. చేస్తున్నది తప్పని తెలిసి కూడా కప్పిపుచ్చుకోటానికి ప్రయత్నం చేస్తారు. అందుకే ఆయనకూ, నాకూ సరిపడదు. ఇదంతా చెప్పి విసిగించటం నా కిష్టంలేదు. ఈమధ్య నాన్నగారి డైరీ తీసి చదివాను. ఒకవిధంగా ఆయనగారి తత్వం గూడా నాకు రుచించలేదు. ఈ పేజీలో ఆయన రాసిన అభిప్రాయం నన్ను ఆశ్చర్యపరిచింది. ఈ విషయం మా యింట్లోకూడా ఎందుకు చెప్పకుండా దాచుకున్నారో అర్థం కావటంలేదు. ఇది చదవండి" ఆ పేజీ తెరిచి డైరీ నాచేతి కిచ్చింది. చదివాను :

'రావ్ పెళ్ళిట. అతను పెళ్ళి చేసుకుంటున్నాడంటే సంతోషంగా వుంది కాని—కుసుమకి అతను తగిన వరుడని ఒక నిశ్చయానికి ఇంతకు మునుపే వచ్చాను. ఈ మాట అతనితో చెప్పటానికి నా మనసెందుకో తటపటాయించింది. రావ్ యోగ్యుడు.అతణ్ణి అల్లుడిగాచేసుకుని ఈఇంటి కాధారం చేసుకుందామనుకున్న నాకు గట్టి దెబ్బ తగిలిందని చెప్పాలి.'

అదరిపడ్డాను. రాధ సూటిగా నా కళ్ళల్లోకి చూచింది.

"చదివారా ?"

"ఊఁ...."

"నాన్న గురించి మీరేమనుకుంటున్నారు."

"విధి చాలా చిత్రాలు చేస్తుందని తెలుసుకున్నాను."

"పొరపాటుని 'విధి'కి అంటగట్టడం భావ్యంగాలేదు. ఆయన మిమ్మల్ని అల్లుడిగా స్వీకరించాలనుకున్నప్పుడు, ఆమాట మీతో అని వుండాల్సింది. అలా జరగలేదు. ఆయన ఇంత త్వరగా పోవటానికి కారణం...."

"రాధగారూ !" గట్టిగా అరిచాను.

"ఇంక నాకే పాపమూ అంటగట్టకండి ప్లీజ్. ఆయన చేసిన సహాయానికి బదులెలా చెప్పుకోవాలో తెలీని పరిస్థితుల్లో వున్నాను. అది చాలక నా మూలంగానే ఆయన.... వద్దు. మీరలాంటి నింద నా నెత్తిన పెట్టకండి" ఒక్క ఉదుటున ఆ గదినుండి బయటకు వచ్చేశాను.

ఆవిడ మెల్లిగా అన్నది :

"మీ వ్యక్తిత్వాన్ని కించపరచాలనే భావం నా కెన్నడూలేదు. నాన్నగారి అతి మంచితనాన్ని గౌరవించటం తప్ప మరొకటి తెలీని మనం ఆయన్ని కించపరచలెం !"

తర్వాత మాటలు నాకు వినిపించలేదు.... కాదు వినదలుచుకోలేదు.

o—o